# దొంగాడొరా?

శ్రీ తాడేపల్లి నరసింహమూర్తి

అప్పుడు నాకు పదేండ్లు. హోటేలులో టిఫిన్ తీసుకొని (అలవాటు లేక కాఫీ తీసుకోలేదు) బిల్లు చెల్లించటానికి హోటేలు యజమాని దగ్గరకు రాగానే వెనక నుంచి ఒక కేక వినిపించింది.

"ఒరే ఇట్రారా"

నేను అదిరిపోయినా. ఆకంఠస్వరాన్ని నేనెక్కడా విన్నట్టు కూడా లేదు. బెరుకు బెరుకుగా వెనక్కుతిరిగి చూశాను. ఒకాయన సిల్కులాల్చీ గ్లాస్కోపంచె తొడుక్కొని హోటేలు కుర్చీ (చేతులు లేని కుర్చీ) లో కూర్చొని వున్నాడు. వీపు ఆనించేచోట చెయ్యివేసి కళ్లకు తగిలించిన ఆ పలకల అద్దాలజోడులోనించి నన్ను చూస్తున్నాడు.

ఆయన 'రావేరా' అని చెయి వూపేసరికి భయపడుతూనే ఆయన వద్దకు నడిచాను. "నన్ను గుర్తుపట్టలేదట్రా" అన్నాడాయన. నేను కిక్కురుమనకుండా ప్రక్కకుర్చీలో కూలబడ్డాను.

"ఏం...హోటళ్లకు కూడా తిరుగుతున్నావేంట్రా?...పదేళ్లు లేవు...అప్పుడే హోటళ్లకా మీ నాన్నతో చెప్తానుండు. ఎంతెత్తుకొచ్చావురా" అన్నాడు నన్ను గదమాయిస్తూ.

"నేనేమి ఎత్తుకురాలేదు. నాకు అర్ధరూపాయి దొరికింది" అన్నా నేను బిక్కమొహంతో.

"ఏం తిన్నావురా" అన్నాడు మళ్లా తన చూపునేమాత్రము మార్చకుండా (అద్దాలపైనుంచి చూస్తూ...) "పావలా"

"ఏదీ మిగతపావలా ఇటివ్వు. నేను మీనాన్నకిస్తాలే. ఒకగంటాగి మీఇంటికొస్తా...పో..." నేను మాట్లాడకుండా పావలా ఆయన జాపిన చేతిలోపెట్టి బయటికొచ్చా బిల్లు చెల్లించిన తరువాత.

* * *

అది వేసవికాలం. ఆరోజున బాగా ఎండకాస్తోంది. నేను నా చిన్నగొడుగుతో, ముద్దు చెప్పులతో-ముద్దు పెట్టుకోలేదనుకోండి-పోస్టులో కార్డు వేసిరావటానికి బయలుదేరాను. పోస్టులో కార్డు వేసి తిరిగి వస్తున్నా.

రోడ్డుమీద జనమంతగా లేరు. అక్కడక్కడ బళ్లు, మనుషులు కన్పిస్తున్నారు. నేనెందుకో క్రిందకు చూచాను-ఎందుకో నాకే తెలియదు. ఏమిటో నాకళ్లముందర మెరుస్తున్నట్లు నాకళ్లు చెప్పాయి దబుక్కున చెయివేశా దానిమీద, తియటానికి. నాజేబులో వున్న పెన్సిలు నాచేతిమీద, పడ్డది. ఆశ్చర్యం! అది ఒక అర్ధరూపాయి. నాకంతకు పూర్వము డబ్బంటూ ఏమీ దొరకలేదు. అందుకనే ఆశ్చర్యం. గోపిగాడికి మొన్న అర్ధణా దొరికింది. వెధవ ... కొనుక్కొని ఎవడికీ పెట్టకుండా తిన్నాడు... నేను కూడా ఎవరికీ పెట్టను... నేనొక్కడ్నే పోయి కొనుక్కుంటా సాయంకాలము... అమ్మో! సాయంకాలము చాలామంది ఆడాకనే పోతుంటారు. ఎవరో ఒకరు చూస్తారు. మా నాన్నగారితో చెప్తారు. ఆయన తంతారు. మొన్న మాతమ్ముడు ఇంట్లోంచి అర్ధణా ఎత్తుకుపోయి కారపుబూంది కొనుక్కు తింటుంటే మానాన్నగారు కనుక్కొని ఎట్లా కొట్టారు ... అబ్బ! నాకే ఏడుపొచ్చింది. అయినా నేను ఎత్తుకుపోలేదుగా ... నాకు దొరికింది! ... అమ్మో! కిట్టిగాడికెంత ధైర్యము. మొన్న ఆ మామిడితోటలోంచి మామిడికాయ కోసుకొచ్చాడు దొంగతనంగా ...వాడు నేను కలిసిపోతేనో?...వద్దు...వాడి దగ్గర మాటలాడకూడదు. మర్నాడే అందరితో చెప్తాడు. నేనొక్కడ్నే పోతా...

కారపుబూంది [illegible] తింటే బాగానే ఉంటుంది. కాని వెధవది దాన్ని నూనెతో తయారు

చేస్తారు. అందుకనేగా మానాన్నగారు నాకు డబ్బు లివ్వకుండా తనే నాకు ఏదికావాలంటే అది కొనుక్కొని వచ్చి పెడ్తారు- కాని మానాన్నగారు నాకు పండ్లు, బిళ్లలు...ఇటువంటివి తప్ప కారపు బూందిఅటువంటివి కొనుక్కురారుగా. వాటిని నూనెతో చేస్తారు. అవి కొనగూడదు. అయినా కారపు బూందికొట్టు బజార్లోనే వుంది మరీను. నేను కొంటుంటే చూస్తారందరూ. చక్కగా కాఫీహోటేలు లోపలికిపోయి కూర్చుంటే బజార్లో వాళ్లెవరూ నన్ను చూడరు. అయినా కాఫీ హోటేలు లోపలికి గూడా జనమొస్తారుగా. అవును రోయి! చక్కగా ఆరోడ్డు మలుపులోవున్న హోటేలుకి ఎవ్వరు రారు. ఎందుకనో?... నేనక్కడికెళ్లి లోపల గదిలో కూర్చుంటా.

కాదు. ఇంటికెళ్ళి, మాఅమ్మ దగ్గరకు పరిగెత్తి, పక్కనకూర్చొని మాఅమ్మకిస్తా డబ్బును. మాఅమ్మ నేనెంతో మంచివాడినని నన్ను ముద్దుపెట్టుకొని, ఎంచక్కా ప్రక్కనున్న వాళ్లతోగూడ "మా పెద్దవాడు చాలా మంచివాడు. నాతో చెప్పకుండా ఒక్క కానీగూడా తీసుకోడు. మా రెండోవాడే వెధవ. మొన్న అర్ధణా ఎత్తుకెళ్లాడు" అంటుంది. అప్పుడు నన్నందరూ మంచివాడ్నని అనుకొంటారు. ఎంత బాగుంటుంది. నాకెంత సంతోషం. మినపట్టు తింటున్నపుడు కూడా అంత సంతోషం రాదు. కాని మినపట్టు అనగానే నాకు నోరూరింది.

మా నాన్నగారి కిస్తేనో?... వద్దు... ఆయన డబ్బు తీసుకొని ఏమి మాట్లాడకుండా జేబులో వేసుకొంటారు. అయినా మానాన్నగారి దగ్గర చాలా డబ్బుందిగా... మాఅమ్మ దగ్గరే లేంది? అందుకని ఇస్తే మా అమ్మకే ఇవ్వాలి.

ఛా!...నే నెవ్వరికీ ఇవ్వను. చక్కగా హోటేలు కెళ్లి కొనుక్కు తింటా. మాఅమ్మ మొన్న కాని ఇవ్వమంటే ఇచ్చిందేం.

ఇల్లు దగ్గరికొచ్చింది. "ఎవ్వరికీ ఇవ్వను నేనే కొనుక్కు తింటా" అనుకుంటూ లోపలికి వెళ్లా.

సాయంకాలం దాక ఏంతో చక అటు ఇటు ఇంట్లోనే తిరిగాను. చివరకు ఎట్లాగైతే నేమి సాయంకాలమయింది. మళ్లా ఈఅర్ధరూపాయి నాదగ్గరనుంచి పోతుందేమోనని జేబులో చెయిదోపి ఆ అర్ధరూపాయిని గట్టిగా పట్టుకొనే ఉన్నా సాయంకాలముదాక. గడియారము అయిదు కొట్టింది. ఇంక బయలుదేరుదామని లేచా. "ఎండ ఇంకా తగ్గనిదే ఎక్కడికిరా పోతున వ"ని కేక వినిపించగానే



వెనకనుంచి ఒక కేక వినిపించింది "ఒరే వినవేరా ?"